క్లుప్తంగా

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం




విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మునగపాకలో నిర్మిస్తున్న మోదకొండమ్మ అలయానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా తన వంతు సాయంగా కమిటీ సభ్యులకు విరాళం అందజేసి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జంపా శ్రీనివాసరావు, బీరా నాగేశ్వరరావు, బీరా శ్రీనివాసరావు, గుదే శివగణేష్, దాడి పోలీసు, తదితరులు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చేనెల 2న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖ మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రారంభోత్సవానికి మంచినీటి పథకం



పూర్తయిన రక్షిత మంచినీటి ట్యాంకు

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రక్షితమంచినీటి పథక నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అన్ని హంగులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. దీంతో గ్రామంలో రానున్న రోజుల్లో తాగునీటికి ఎటువంటి సమస్య ఉండబోదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి ట్రాక్టర్ పట్టివేత

మునగపాక: మండలంలోని చూచుకొండ సమీపంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను మునగపాక పోలీసులు సీజ్ చేశారు. చూచుకొండలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నక్కపల్లి: రాజయ్యపేటలో కుసుమ కావ్య ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పిక్కి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మహాత్మాగాంధీ ఆస్పత్రి, కేర్ ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సుభద్ర, డాక్టర్ రాహుల్, డాక్టర్ వినయ్, డాక్టర్ పాల్, తదితరులు శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. స్త్రీలకు గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్, తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు రూ.6 వేలు విలువ గల పరీక్షలను ఉచితంగా చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. 170 మందికి క్యాన్సర్ పరీక్షలు, 200 మందికి డెంటల్, 70 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు పిక్కి స్వామి తెలిపారు.

లక్ష్యం కనుమరుగు



వేంపాడులో నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ మరుగుదొడ్లు

నిరుపయోగంగా కమ్యూనిటీ మరుగుదొడ్లు

అవసరం లేనప్పటికీ లక్షలు వెచ్చించి నిర్మాణం ● లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



రాజయ్యపేటలో పునాది లేకుండా సిమెంట్ ఇటుకలతో నిర్మించి వదిలేసిన మరుగుదొడ్డి

నక్కపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్షాది రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. అవసరం లేనప్పటికీ టీడీపీ నాయకుల లబ్ధి కోసం ఈ మరుగుదొడ్లు నిర్మించడంతో లక్ష్యం నీరుగారింది. గతంలో 2014–19 మధ్య కాలంలో నక్కపల్లి మండలంలో పలు చోట్ల టీడీపీ ప్రభుత్వం నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ మరుగుదొడ్లకు అప్పట్లోనే వాడుకనీటి సదుపాయం కల్పించకపోవడంతో ఉపయోగించకుండా వదిలేశారు. ఆయా ప్రాంతాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించే అవసరం లేకపోయినప్పటికీ కేవలం టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడం కోసమే ఈ మరుగుదొడ్లు నిర్మించారన్న ఆరోపణలు అప్పట్లోనే వ్యక్తమవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది. వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు, కొన్ని గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించింది. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపని లబ్ధిదారుల పేరున మంజూరు చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి వీటిని నిర్మించింది. పేరు లబ్ధిదారులది బిల్లులు మాత్రం కాంట్రాక్టర్ల స్వాహా చేశారు. ఇలా నక్కపల్లి మండలంలో నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం తదితర గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించారు. వేంపాడులో ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 15 మంది కోసం కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించారు. వాస్తవంగా ఇక్కడ కమ్యూనిటీ మరుగుదొడ్డి అవసరం లేదు. కానీ కార్యకర్తలకు మేలు కలిగించడం కోసమే వీటిని నిర్మించారన్న విమర్శలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ మరుగుదొడ్డి వద్ద రన్నింగ్ వాటర్ కోసం బోరు నిర్మించారు. ఇది మూన్నాళ్లకే పాడైంది. నిర్మించిన కొత్తలో ఓ రెండు నెలల పాటు స్థానికులు వీటిని ఉపయోగించారు. తర్వాత బోరు పాడవడం, వాడుకనీరు లేకపోవడంతో ఇళ్ల నుంచి నీటిని తీసుకెళ్లలేక లబ్ధిదారులు ఈ మరుగుదొడ్లను ఉపయోగించడం మానేశారు. వీటికి ఏర్పాటు చేసిన తలుపులు చోరీకి గురయ్యాయి. ఈ కమ్యూనిటీ మరుగుదొడ్లను శుభ్రం చేసే నాథుడే కరువయ్యాడు. వీటి ఆలనాపాలనా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ మరుగుదొడ్ల చుట్టూ పిచ్చి తుప్పలు పెరిగిపోయాయి.

వ్యక్తిగత మరుగుదొడ్లదీ అదే దుస్థితి

2014లో కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్ల పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలని, నిర్మించుకోకపోతే రేషన్ కార్డుపై సరకులు ఇచ్చే ప్రసక్తి ఉండదని టీడీపీ ప్రభుత్వం బెదిరించింది. లక్ష్యం మంచిదే అయినా.. ఈ పథకం ద్వారా మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణపు బాధ్యతలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే అప్పగించడంతో లక్ష్యం నీరుగారింది. గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్ద నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు పరిస్థితి కూడా అలాగే ఉంది. మెట్ల కింద, డ్రైనేజీల పైన కేవలం బిల్లులు స్వాహా చేయడం కోసమే రెండు గోడలు పెట్టి, బేసిన్ ఏర్పాటు చేసి పైన రేకులు వేసి ఒక్కొక్క మరుగుదొడ్డికి రూ.15వేలు బిల్లులు స్వాహా చేశారని, తమకు నిర్మించుకునే అవకాశం కూడా ఇవ్వలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. నాసిరకం మెటీరియల్ ఉపయోగించి వీటిని నిర్మించడం వల్ల పట్టుమని ఆరు మాసాలు కూడా ఉపయోగించ లేదని వారు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే సొంత డబ్బులు పెట్టి నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు కూడా చెల్లించలేదు. మరికొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా వదిలేశారు. బిల్లులు మాత్రం స్వాహా చేశారు. లబ్ధిదారులే సొంత నిధులు ఖర్చు చేసి పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత మరుగుదొడ్ల పేరుతో అప్పట్లో టీడీపీ నాయకులు పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు రూ.12 కోట్లు స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ కమ్యూనిటీ మరుగుదొడ్లను మరమ్మతులు చేయించి తిరిగి వాడుకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిధుల వృథా



మా గ్రామంలో జెడ్పీ పాఠశాలకు సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 మందికి సరిపడా సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. దూరంగా నిర్మించడంతో ఎవరూ వీటిని ఉపయోగించలేదు. వీటికి తాళాలు వేశారు. నిరుపయోగంగా మారి పూర్తిగా పాడైపోయాయి. వీటిని తొలగిస్తే ఈ స్థలంలో ఏదైనా ప్రభుత్వ భవనాలు నిర్మించే అవకాశం ఉంది. అవసరం లేకపోయినా ఈ మరుగుదొడ్లు నిర్మించడం వల్ల నిధులు వృథా అయ్యాయి.

– పి.వెంకటేష్, సర్పంచ్, ఉద్దండపురం



ఉద్దండపురంలో నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

ఈ చిత్రంలో కనిపిస్తున్న మరుగుదొడ్లు ఉద్దండపురంలో సుమారు 50 మంది కోసం నిర్మించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో నిర్మించిన ఈ మరుగుదొడ్లు తమకు దూరంగా ఉన్నాయంటూ ఎవరూ ఉపయోగించడం మానేశారు. దీంతో అధికారులు వీటికి తాళాలు వేసేశారు. ఆరేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం పిచ్చితుప్పలు పెరిగిపోయాయి. వినియోగించకుండానే మూలకు చేరిన దుస్థితి నెలకొంది. ఇక తీరప్రాంత గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు నిర్మించిన వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లలో నాణ్యత కొరవడింది. ఇసుక నేలలు కావడంతో పునాదులు లేకుండానే కేవలం సిమెంట్ ఇటుకలతో రెండు గోడలు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారని అక్కడ లబ్ధిదారులు తెలిపారు. కొంత మంది లబ్ధిదారులు తమ సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మిస్తే బిల్లులు చెల్లించలేదని చాలా రోజులు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరిగిన రోజులు ఉన్నాయి.

నిర్వహణ లేక మూలకు..

మా గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించారు. వాటికి పూర్తి స్థాయిలో వాడుకనీరు సరఫరా లేకపోవడం, నిర్వహణ బాధ్యతలు ఎవరూ తీసుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. బీసీ, ఎస్సీ కాలనీల్లో చాలా మంది వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్థలం కొరత కారణంగా చాలా ఇబ్బంది పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకు వస్తే ఉపయోగం ఉంటుంది.

– సురేష్‌రాజు, వేంపాడు

పుణ్య కోటి వాహనంపై పురుషోత్తముడు



పుణ్యకోటి వాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి తిరువీధి సేవలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉత్సవమూర్తులకు, క్షేత్ర పాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని పుణ్యకోటి వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు జరిపారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురంతో నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్టి, ప్రసాద వితరణ జరిగింది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఈ సేవల్లో ప్రధానార్చకులు వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు పాల్గొన్నారు.

చనిపోయిన భవన నిర్మాణ కార్మిక కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

అచ్యుతాపురం: మండలంలోని బార్క్‌లోని ఆర్‌వీఆర్ కాంట్రాక్ట్ సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎ.దుర్గారావు కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్న సదరు కార్మికుడి మృతితో ఆ కుటుంబం వీధిన పడిందని, తక్షణమే కాంట్రాక్టు సంస్థ ఆదుకోవాలని కోరారు. శ్రీకాకుళానికి చెందిన దుర్గారావు గత శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పని చేస్తూ బిల్డింగ్‌పై నుంచి పడిపోవడంతో మృతి చెందాడని రాము తెలిపారు. కాంట్రాక్ట్ సంస్థ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు గాలి రమణ, లక్ష్మణరావు, చంద్రరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



అచ్యుతాపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక సభ్యులు

అచ్యుతాపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిసెట్టి వెంకట అప్పారావు కోరారు. ఈ మేరకు అచ్యుతాపురం ఆదివారం జన విజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. 2025 నూతన సంవత్సరాన్ని మంచిగా ప్రారంభించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురైతే కుటుంబం ఎంత నష్టపోతుందో అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.0

ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు శూన్యం



విలేకర్లతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం: ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని మండల వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు ఆరోపించారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో పెదఉప్పలం, చినఉప్పలం రెవెన్యూ పరిధిలో సుమారు 260 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని ఫిర్యాదు చేశానన్నారు. చేపల చెరువులు, కొబ్బరి తోట, ఇతర పంటలు సాగు చేసుకుంటూ దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. ఈ రెండు గ్రామాల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలు గురైనట్టు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించానన్నారు. పెద ఉప్పలం రెవెన్యూ 428, 491, 500, 497, 499, 498లలో 160 ఎకరాలు, చిన ఉప్పలంలో 83, 108, 109, 114, 116, 119, 123, 124, 125, 126 సర్వే నంబర్లలో 100 ఎకరాలు చొప్పున ఆక్రమణలకు గురయ్యినట్టు రెవెన్యూ అధికారులే వివరాలు ఇచ్చారన్నారు. ఈ వివరాలతో గత నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ




గోనెల సత్తిబాబును పరామర్శిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు ఆదివారం పరామర్శించారు. తునిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాల్తేరు గ్రామానికి చెందిన గోనెల సత్తిబాబు, దేవవరపు వెంకట జోగారావు, పెంటకోట గ్రామానికి చెందిన ఈగల చిట్టెలమ్మలను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, నాయకులు దేవవరపు వెంకటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ రేపు

పాయకరావుపేట: ప్రభుత్వం జనవరి నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాషరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 12,829 మంది వివిధ సామాజిక పింఛన్లు అందుకోనున్నారని పేర్కొన్నారు. మొత్తం రూ.5,27,41,500 లబ్ధిదారులకు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

అథ్లెటిక్స్‌లో పీఆర్‌టీయూ ఉపాధ్యక్షుడి సత్తా



రజత పతకం స్వీకరిస్తున్న రామారావు

ఎస్.రాయవరం: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రామారావు గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. 400 మీటర్ల పరుగు పందెం, 5కే వాకింగ్‌లో రజత పతకం సాధించారు. దీంతో ఆయనకు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, తదితరులు అభినందనలు తెలిపారు.

దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

యలమంచిలి రూరల్: పట్టణంలో హోండా షోరూం పక్కనున్న పూజా సామగ్రి విక్రయించే దుకాణంలోకి శనివారం రాత్రి దౌర్జన్యంగా చొరబడి సామగ్రిని చెల్లాచెదురు చేసిన చంద్రశేఖర్‌పై దుకాణ యజమాని సిరసపల్లి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి ఆదివారం తెలిపారు. ఫిర్యాదుదారుడు నిందితుని వద్ద నుంచి గతంలో తీసుకున్న బాకీ డబ్బు ఇవ్వకపోవడంతో ఈ వివాదం ఏర్పడినట్టు పోలీసులు గుర్తించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

తోటాడ, గంగాదేవిపేటలలో నేడు రెవెన్యూ సదస్సులు

మునగపాక: మండలంలోని తోటాడ, గంగాదేవిపేట గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తోటాడ సచివాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, గంగాదేవిపేటలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఎంపీ బాబూరావును కలిసిన నేతలు



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుతో వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గొల్ల బాబూరావును ఆదివారం ఆ పార్టీ నాయకులు కలిశారు. ఏలూరు నుంచి విశాఖ వెళ్తున్న ఆయనను అడ్డురోడ్డులో పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సర్పంచ్‌లు నాగ అప్పలరాజు, తదితరులు కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, విద్యుత్ చార్జీల పెంపుపై పార్టీ తరపున చేస్తున్న ఆందోళనలు, తదితర అంశాలను బాబూరావుకు వివరించామని నర్సింహమూర్తి తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ నాయకులు యలమంచిలి తాతబాబు, బాబూరావు, ఎరిపల్లి నాగేశు, పిక్కి నూకరాజు, తదితరులు ఉన్నారు.

ఆత్మీయ కలయికల సందడి



తొట్లకొండ బీచ్‌లో కలుసుకున్న 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం ఆలయ ప్రాంగణంలో 1988-89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



అరకులోయలో మునగపాకకు చెందిన విజయ్, అజయ్ మైత్రి అసోసియేషన్ సభ్యులు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పలు ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు విశాఖలోని తొట్లకొండ బీచ్ వద్ద సమావేశమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మళ్ల పరదేశి నాయుడు, పెంటకోట పట్టాభి, దొడ్డి శ్రీను, కర్రి భాస్కరరావు, కొయిలాడ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

- మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళంలోని శ్రీకూర్మం ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమావేశమై ఉత్సాహంగా గడిపారు. ఉమామహేష్, ప్రసాద్, డాక్టర్ మళ్ల జోగారావు, అప్పలనాయుడు, డాక్టర్ సన్యాసిరావు, మాధవ, రామకోటి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
- మునగపాకలోని పెంటకోట విజయ్, అజయ్ మైత్రి అసోసియేషన్ సభ్యులు ఆదివారం అరకులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర, పోలీసులు

రాంబిల్లి(యలమంచిలి): పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను రాంబిల్లి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవిందపాలెం గ్రామం శివారులో ఓ తోటలో రహస్యంగా పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.39 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఫిబ్రవరి 28లోగా జీవన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ జీవన ధ్రువీకరణ పత్రాలను 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా ఉప ఖజానా కార్యాలయంలో సమర్పించాలని యలమంచిలి ఉప ఖజానాధికారి టి.ఉదయ్ భాస్కర్ తెలిపారు. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్ ద్వారా కానీ, జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్ ద్వారా కానీ ఉపఖజానా కార్యాలయంలో అందించాలన్నారు. బయోమెట్రిక్ సరిగా లేనివారు, ఆరోగ్యం సరిగా లేక మంచానికే పరిమితమైన వారు తమ కార్యాలయంలో తెలియజేస్తే సిబ్బంది పెన్షనర్ వద్దకు వచ్చి లైఫ్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తారని పేర్కొన్నారు.